నేడు గోపన్‌పల్లిలో రక్తదానశిబిరం

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ సేవా కేంద్రం ఆధ్వర్యంలో శనివారం యూనివర్సల్ బ్రదర్‌హుడ్ రక్తదాన శిబిరంను గోపన్‌పల్లిలో నిర్వహిస్తారు. గోపన్‌పల్లిలోని విస్టా ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. రక్తదానం చేయడానికి యువత స్వచ్ఛందంగా ముందుకురావాలని బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధులు కోరారు. ముఖ్యంగా మానవ తాదృక్పదంతో 18 -65 ఏళ్ల వయస్సు కలిగిన ఆరోగ్యవంతులు రక్తదానం చేయాలని కోరారు.

పోస్టు కార్డు ఉద్యమం



సంతకాలు చేస్తున్న విద్యార్థులు

రాయదుర్గం: భారతదేశంలో 2024 సాధారణ ఎన్నికల్లో ఓట్ల చోరీ జరిగిందని, ఈ అంశంలో జోక్యం చేసుకోవాలని నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా(ఎన్‌ఎస్‌యూఐ) భారత రాష్ట్రపతిని కోరుతూ పోస్టుకార్డు ఉద్యమానికి శ్రీకారం చుట్టింది.ఎన్‌ఎస్‌యూఐ హెచ్‌సీయూ జాతీయ అధ్యక్షుడు వరుణ్‌చౌదరి ఆదేశాలపై రాష్ట్ర మాజీ కార్యదర్శి సునీల్‌కుమార్ శుక్రవారం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ఉద్యమానికి భారీ మద్దతు లభించిందని ఎన్‌ఎస్‌యూఐ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రితేష్‌రావు, ఎన్‌ఎస్‌యూఐ హెచ్‌సీయూ నాయకులు, సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేబుల్‌వైర్లు కట్



మాదాపూర్: స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మాదాపూర్‌లోని ప్రధాన రహదారుల్లోని విద్యుత్ స్తంభాలకు ఉన్న కేబుల్‌వైర్లను ఎక్కడికక్కడ కట్ చేశారు. ఐటీ ప్రాంతం కావడం..సమాచారం లేకుండా కేబుల్ వైర్లను కట్ చేయడంతో నివాసితులు , ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఓబీసీ కులగణన చేయాలి

రాయదుర్గం: దేశవ్యాప్తంగా వెంటనే ఓబీసీ కులగణన చేయాలని భారతీయ విద్యార్థి మోర్చా రాష్ట్ర కన్వీనర్ భూంపల్లి రవితేజ డిమాండ్ చేశారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్ ప్రధాన ద్వారం సమీపంలో బాంసెఫ్, రాష్ట్రీయ మూల్‌నివాసి సంఘ్ 12వ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను శుక్రవారం సాయంత్రం ఆవిష్కరించారు. కామారెడ్డిలో జరగనున్న సభలకు విద్యార్థులు, యువకులు, నిరుద్యోగులు, మేధావులు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కన్వీనర్ పెరిక అలెక్స్, హెచ్‌సీయూ విద్యార్థి నాయకులు శశాంక్, ప్రభాస్, గణేష్, నిరాజ్, చేతన్, సురేష్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు

నేడు శని అమావాస్య పూజలు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శ్రీ రామలింగేశ్వర దేవస్థానంలో శని అమావాస్య నేపథ్యంలో ఉదయం 5 గంటల నుండి 10 గంటల వరకు శనీశ్వర స్వామికి తైలాభిషేకం, శ్రీ రామలింగేశ్వరస్వామికి అభిషేకం జరుగుతుందని ఆలయ అర్చకులు మహేష్ ,గణేష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శని దోష నివారణకు పూజలు చేస్తామన్నారు.

స్లీవ్ గ్యాస్ట్రెక్టమీతో అద్భుత ఫలితాలు: డా. కేశవరెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: ఊబకాయంతో బాధపడుతున్న వారికి స్లీవ్ గ్యాస్ట్రెక్టమీ శస్త్రచికిత్సతో అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని డా.కేశవరెడ్డి అన్నారు. శుక్రవారం గచ్చిబౌలి కిమ్స్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో వైద్యరంగం తెలంగాణకో, దేశానికో పరిమితం కాలేదని, ప్రపంచ ఖ్యాతిని గడించిందని వివరించారు. బరువు తగ్గాలని ఇంగ్లండ్ నుంచి హైదరాబాద్ వచ్చి శస్త్రచికిత్స చేయించుకున్న 59 ఏళ్ల అలెగ్జాండ్రియా ఫాక్స్ గురించి వివరించారు. ఆమెకు చికిత్స సమయంలో ఉదర భాగంలో 2/3 వంతు తొలగించాం. మధుమేహం, రక్తపోటు అదుపులోకి వచ్చాయి. కిడ్నీ వైఫల్యాన్ని అధిగమించగలిగారని పేర్కొన్నారు. శస్త్రచికిత్స చేయించుకున్న 24 గంటల్లో కోలుకున్నారని తెలిపారు. లండన్‌లో మూడు దశాబ్దాలు పనిచేశానని, మాతృభూమిపై మమకారంతో తిరిగి హైదరాబాద్‌లో సేవలందించాలని నిర్ణయించుకున్నానని తెలిపారు. కార్యక్రమంలో లండన్ నుంచి వైద్యం కోసం వచ్చిన అలెగ్జాండ్రియా ఫాక్స్, ఆసుపత్రి వైద్యులు ఉన్నారు.

ఆరోగ్య తెలంగాణగా తీర్చిదిద్దేందుకు సీఎం కృషి

- మంత్రి వాకిటి శ్రీహరి
- హైటెక్స్‌లో స్పోర్ట్స్ ,ఎకో సస్టెయిన్ ఎక్స్‌పోలు ప్రారంభం



హైటెక్స్‌లో ఏర్పాటు చేసిన ఎక్స్‌పోలను ప్రారంభించిన మంత్రి శ్రీహరి

మాదాపూర్: క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని, స్పోర్ట్స్ పాలసీ అదే దిశగా అడుగువేస్తుందని తెలంగాణ రాష్ట్ర క్రీడా, యువజనశాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో రెండురోజుల పాటు నిర్వహించనున్న స్పోర్ట్స్ ఎక్స్, మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఎకో సస్టెయిన్ ఎక్స్‌పోలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణను ఆరోగ్య రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. చిన్న దేశమైన దక్షిణకొరియా 36 ఒలింపియన్లను అందిస్తే, 140 కోట్ల జనాభా ఉన్న భారత్ ఎందుకు సాధించకూడదన్నారు. తెలంగాణను యాక్టివ్ లైఫ్‌స్టైల్ కాపిటల్‌గా మార్చేందుకు అందరూ ప్రభుత్వంతో కలిసి పనిచేయాలన్నారు. డిప్యూటి స్పీకర్ జటోత్ రామ్‌చందర్ నాయక్ మాట్లాడుతూ ప్రపంచంలోనే ఎక్కువ యువ జనాభా మన దేశంలోనే ఉందన్నారు.ఎక్కువశాతం ప్రజలు గ్రామాల్లో నివసిస్తున్న దృష్ట్యా పరిశ్రమలు గ్రామాల దిశగా వెళ్ళాలన్నారు. అనంతరం ఇండియన్ గ్రీన్‌గ్యాస్ ఎక్విప్‌మెంట్ మాన్యూఫ్యాక్చరర్ల అసోసియేషన్ ను ఆవిష్కరించారు. ఈ ఎక్స్‌పోలో 60 ఎగ్జిబిటర్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో హైటెక్స్ బిజినెస్ హెడ్ టీజీ.శ్రీకాంత్, స్పోర్ట్స్ అథారిటి ఆఫ్ తెలంగాణ చైర్మన్ శివసేనారెడ్డి, హెడ్ ఆఫ్ కార్పొరేట్ కమ్యూనికేషన్స్ జయప్రకాశ్, ఎన్‌ఎండిసి డైరెక్టర్ రాజేశ్ వెట్చా, ప్రముఖ పర్యావరణవేత్త ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ తదితరులు పాల్గొన్నారు.





ఘనంగా రాజాబహదూర్ వెంకట రామారెడ్డి జయంతి



వెంకటరామారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రఘునందన్‌రెడ్డి తదితరులు

చందానగర్: రాజాబహదూర్ వెంకట రామారెడ్డి జయంతి ఉత్సవాలు శుక్రవారం చందానగర్‌లోని రెడ్డి కాలనీలో రాజా బహదూర్ వెంకటరామారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ మాజీ సంయుక్త కార్యదర్శి రఘునందన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునందన్‌రెడ్డి ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిజాం పరిపాలనలో పోలీస్ కమిషనర్‌గా పేరు సంపాదించారన్నారు. బాలికల విద్య కోసం తన సొంత నిధులతో స్కూల్స్, కాలేజీలు, హాస్టళ్లు నిర్మించారన్నారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం ఉపాధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి, సంయుక్త కార్యదర్శి కొండల్‌రెడ్డి, కాలనీ అధ్యక్షులు, కార్యదర్శి, కాలనీవాసులు పాల్గొన్నారు.

మెరిడియన్‌లో మోడల్ యునైటెడ్ నేషన్స్

మాదాపూర్: విద్యార్థి దశ నుంచి నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని మాజీ వింగ్ కమాండర్ సందీప్ సింగ్ జగ్గి తెలిపారు. మాదాపూర్‌లోని మెరిడియన్ పాఠశాలలో శుక్రవారం మోడల్ యునైటెడ్ నేషన్స్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లో ఏం జరుగుతుందో తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ కరణం భవాని మాట్లాడుతూ మూడు రోజుల పాటు నిర్వహించే ఈ మోడల్ యునైటెడ్ నేషన్స్ సెషన్స్‌లో నగరంలోని 40 పాఠశాలలకు చెందిన 500 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

భూ సర్వేలో డ్రోన్ సాంకేతికత విప్లవాత్మకం

'ఎస్కీ' డైరెక్టర్ డా.రామేశ్వర్‌రావు



ఎస్కీలో శిక్షణ పొందుతున్న వారితో ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు, మేఘ సంస్థ అధికారులు డాక్టర్ సుధీర్‌కుమార్ న్యాతాని, సురేంద్రకుమార్

రాయదుర్గం: నూతన సాంకేతిక విధానాలతోనే డిజిటల్ ల్యాండ్ సర్వే అండ్ మ్యాపింగ్ సాధ్యమవుతుందని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వర్‌రావు స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని 'ఎస్కీ' క్యాంపస్‌లో మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సహకారంతో సివిల్ ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ టెక్నాలజీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో డిజిటల్ ల్యాండ్ సర్వేయింగ్ మ్యాపింగ్‌పై రెండు రోజుల శిక్షణా తరగతులను ఆయన జ్యోతి వెలిగించి శుక్రవారం ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ భూసర్వేలో పాటించాల్సిన మౌలిక సూత్రాలను ఖచ్చితంగా నిర్వహించిన తర్వాత స్వతంత్ర తనిఖీ చేయాలన్నారు. ల్యాండ్ సర్వేయింగ్‌లో లైడార్ సర్వేతో పాటుగా డ్రోన్ మ్యాపింగ్‌లో రియల్ టైమ్ కీనెమాటిక్, పోస్ట్ ప్రాసెస్ కీనెమాటిక్ పద్ధతుల ద్వారా ప్రతి ఇంచు భూమి వివరాలు మనకు సులభంగా తెలిసిపోతాయన్నారు.హెచ్‌ఆర్ జనరల్ మేనేజర్ డాక్టర్ సుధీర్ కుమార్ న్యాతాని మాట్లాడుతూ డ్రోన్ సాంకేతికత భూ సర్వే విధానాన్ని విప్లవాత్మకంగా మార్చిందన్నారు. హెచ్‌ఆర్ ఏజీఎం సురేంద్రకుమార్ మాట్లాడుతూ భూ వినియోగంలో ఖచ్చితమైన కొలతలు, వివరమైన మోడల్స్‌ను డ్రోన్ టెక్నాలజీ అందిస్తుందన్నారు. ఎస్కీ సివిల్ ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్ హెడ్ డాక్టర్ ఆర్ వెంకట్‌రెడ్డి, మేనేజ్‌మెంట్ టెక్నాలజీ హెడ్ డాక్టర్ యూ జ్యోతి, డాక్టర్ కె భరత్ శిక్షణ వివరాలను అందించారు. కార్యక్రమంలో సీహెచ్ తిలక్, సునీత, ఇంజనీర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఐదుగురి మృతిపై కొనసాగుతున్న విచారణ

- పెద్దకూతురు లక్ష్మి, ఆమె భర్త చాంద్‌పాషాలను విచారిస్తున్న పోలీసులు
- ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నారా.. అనే కోణంలోనూ ఆరా

మియాపూర్ : మక్తమహబూబ్‌పేటలో ఒకే కుటుంబంలో ఐదుగురు మృతి చెందిన ఘటనపై పోలీసుల విచారణ కొనసాగుతోంది. లక్ష్మయ్య అనారోగ్యం, ఆర్థిక పరిస్థితి బాగాలేకపోవడం, రెండో అల్లుడు అనిల్ సొంత గ్రామంలో అప్పులు ఉండటంతో అందరూ కలిసి ఆత్మహత్య చేసుకుని ఉంటారని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. విషం కలిసిన ఆహారం తినడంతోనే వారు మృతి చెందారని పోస్టుమార్టమ్ నివేదిక వచ్చిన నేపథ్యంలో...ల్యాబ్ నుంచి వచ్చే ఫోరెన్సిక్ రిపోర్టు కోసం పోలీసులు ఎదురుచూస్తున్నారు. 30 నుంచి 45 రోజుల్లో రిపోర్ట్ వస్తుందని మియాపూర్ ఇన్‌స్పెక్టర్ శివ ప్రసాద్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులే కారణమా?

కొంతకాలం క్రితం లక్ష్మయ్య కాలికి గాయం కావడంతో పనికి వెళ్లకుండా ఇంటివద్దే ఉంటున్నాడు. వెంకటమ్మ స్కూల్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. రెండో అల్లుడు అనిల్ సొంత గ్రామంలో అప్పులుచేసి అక్కడ తల్లిదండ్రులతో గొడవపడి రెండు నెలల క్రిందట భార్య కవిత, కుమారుడు యువాన్ష్‌ను తీసుకొని బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వచ్చాడు. అజీజ్‌నగర్‌లో నివాసముంటూ కూలిపనులు చేస్తుండేవాడు. అక్కడి నుంచి మక్తమహబూబ్‌పేటకు మకాం మార్చేందుకు ఆరు రోజుల క్రితమే అత్తామామల ఇంటికి వచ్చాడు. అయితే అందరూ ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకొని ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

పెద్ద కుమార్తె లక్ష్మి, ఆమె భర్తపై అనుమానాలు

ఐదుగురు చనిపోవడానికి ముందు వెంకటమ్మ పెద్ద కుమార్తె చివరిసారి వచ్చి వెళ్లడంతో లక్ష్మి, ఆమె భర్త చాంద్‌పాషాపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో మియాపూర్ పోలీసులు గురువారం వారిని అదుపులోకి తీసుకుని విచారించినట్లు సమాచారం. సొంత ఊరిలో అంత్యక్రియలు ఉండటంతో లక్ష్మిని పంపించగా చాంద్‌పాషా పోలీసుల అదుపులోనే ఉన్నట్టు తెలిసింది.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్‌డ్రైవ్ లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 14 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ముగ్గురికి ఒక్కొక్కరికి రూ. వెయ్యి జరిమానా, మరో ఎనిమిది మందికి రూ. 1500, మరో ఇద్దరికి రెండు రోజులు, మరో వ్యక్తికి మూడురోజులు జైలు శిక్ష, జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపాలిటీ ఖాజీపల్లి పరిధిలోని సర్వేనం .181 ప్రభుత్వ స్థలం ఆక్రమణపై ఫిర్యాదు అందుకున్న రెవెన్యూ యంత్రాంగం చర్యలు చేపట్టింది. ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపట్టేందుకు కొందరు వ్యక్తులు పునాదులు తీయగా, దీనిపై స్థానికుల ఫిర్యాదులతో శుక్రవారం తహసీల్దార్ దేవదాసు ఆదేశాల మేరకు ఆర్‌ఐ జయప్రకాష్ నారాయణ పునాదులను జేసీబీ సాయంతో పూడ్చివేయించారు. ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని. క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కార్పొరేటర్ పర్యటన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలో అశోక్‌నగర్ కాలనీలో శుక్రవారం కార్పొరేటర్ బి.పుష్ప అధికారులతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. కాలనీలో రోడ్లు గుంతలమయంగా మారాయని తెలిపారు. కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో సీసీ రోడ్లు వేయిస్తామని హామీ ఇచ్చారు. కాలనీ అధ్యక్షులు శేషారెడ్డి, రాజేష్, కేశవులు, నరసింహచారి, సాంబశివరావు, శేఖర్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



మియాపూర్: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ ఆల్విన్ ఎక్స్‌రోడ్డు సమీపంలో పెట్రోల్‌బంకు పక్కన ఖాళీ ప్రదేశంలో ఓ వ్యక్తి పడి ఉన్నాడని మియాపూర్ పోలీసులకు గురువారం రాత్రి సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా ఆ వ్యక్తి (35-40) మృతిచెంది ఉన్నాడు. అతనికి సంబంధించిన సమాచారం లభించలేదు. చుట్టుప్రక్కల ఆరా తీయగా కొన్నాళ్లుగా ప్లాస్టిక్ బాటిళ్లు, ఇతర వసువులను ఏరుకుని స్క్రాప్ దుకాణంలో అమ్మేవాడని తెలిపారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

సూపర్ లగ్జరీ, లహరి బస్సు ఛార్జీల్లో రాయితీ

మియాపూర్ : మియాపూర్ ఆర్టీసీ-1 డిపో పరిధిలో మియాపూర్ నుండి దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు టీజీఎస్ ఆర్టీసీ శుభవార్త తెలిపింది. మియాపూర్ నుండి దూర ప్రాంతాలకు వెళ్లే సూపర్ లగ్జరీ, లహరి నాన్ ఏసీ సీటర్ కం స్లీపర్ టికెట్ ధరపై 15 శాతం రాయితీ, అదేవిధంగా లహరీ ఏసీ సీటర్ కం స్లీపర్ 10 శాతం రాయితీ ఇస్తున్నట్లు డిపో మేనేజర్ మోహన్‌రావు తెలిపారు. మియాపూర్ నుండి ఒంగోలు, కడప, తాడపత్రి, గుంటూరు, అనంతపురానికి వెళ్లే సూపర్ లగ్జరీ, లహరీ బస్సులకే ఈ రాయితీ వర్తిస్తుందని తెలిపారు.

కేన్సర్ కుటుంబాన్ని ఛిన్నాభిన్నం చేస్తుంది

సహజ నటి, మాజీ ఎమ్మెల్యే జయసుధ.. అరిట్ ఆస్పత్రిలో 'హెచ్‌ఆర్‌సీ' పరీక్ష ప్రారంభం



అరిట్ ఆస్పత్రిలో కార్యక్రమంలో పాల్గొన్న సినీనటి జయసుధ, మానస వారణాసి

రాయదుర్గం: 'కేన్సర్ అనేది కుటుంబాన్నే చిన్నాభిన్నం చేస్తుందని సహజనటి, మాజీ ఎమ్మెల్యే జయసుధ పేర్కొన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీ ప్రాంతంలో అరిట్ ఆస్పత్రిలో కేన్సర్‌ను ముందుగానే గుర్తించే హిమాన్షురాయ్ కేన్సర్ టెస్ట్ ('హెచ్‌ఆర్‌సీ) రక్త పరీక్షను హైదరాబాద్ నగరంలో మొదటిసారిగా ఆమె ప్రారంభించి పరీక్షను చేయించుకున్నారు అనంతరం జరిగిన సమావేశంలో జయసుధ మాట్లాడుతూ రోజువారీ పనుల్లో పడి, క్రమం తప్పకుండా చేయించుకోవాల్సిన ఆరోగ్య పరీక్షలను నిర్లక్ష్యం చేయటమనేది మన భవిష్యత్తుకు ఎంతో నష్టం కలిగిస్తుందన్నారు. అరిట్ ఆస్పత్రుల కృషిని అభినందించాల్సిన అవసరం ఉందన్నారు. ఆరోగ్య సంరక్షణ అంటే అనారోగ్యానికి చికిత్స చేయటమే కాదని, అది రాకుండా చూసుకోవడం కూడా అని ఆమె వివరించారు.

కేన్సర్‌ను ధైర్యంగా ఎదుర్కొనే భవిష్యత్‌కు దగ్గరవుతున్నాం : మాజీ మిస్ ఇండియా వరల్డ్ మానస వారణాసి

కేన్సర్‌ను ధైర్యంగా ఎదుర్కొనే భవిష్యత్‌కు మనం దగ్గరవుతున్నామని మాజీ మిస్ ఇండియా వరల్డ్ మానస వారణాసి పేర్కొన్నారు. ఒక మహిళగా, సమాజ హితం కోరే వ్యక్తిగా ముందస్తుగానే క్యాన్సర్‌ను స్క్రీన్ చేసే ఈ హెచ్‌ఆర్‌సీ పరీక్ష ఆరోగ్య సంరక్షణలో ఒక మార్గదర్శక ఘట్టం అని అన్నారు. అరిట్ ఆస్పత్రి డైరెక్టర్ ఆఫ్ ఆంకాలజీ, సీనియర్ కన్సల్టెంట్, రేడియేషన్ అంకాలజీ డాక్టర్ విజయ్‌కరణ్‌రెడ్డి పాలకొండ మాట్లాడుతూ వ్యాధిని తొందరగా గుర్తించడం పేషెంట్స్ ప్రయాణాన్ని ఎంతగానో మార్చుతుందని తాను దీన్ని ప్రత్యక్షంగా చూశానన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి ప్రివెంటివ్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ ప్రణతి కేసర, ఆస్పత్రి స్ట్రాటజీ అండ్ ఆపరేషన్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అమన్ గుర్వాడా, పలువురు డాక్టర్లు పాల్గొన్నారు.

ఘనంగా 'మేరుత్సవ్- 2025'



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

చందానగర్ : మియాపూర్ మదీనాగూడలోని మేరు ఇంటర్నేషనల్ స్కూల్ ప్రతిష్టాత్మక అంతర్ పాఠశాల ఉత్సవం 'మేరుత్సవ్- 2025' క్రీడల మహోత్సవంను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సంగీతం, నృత్యం, నాటకం, చెస్, ఆర్ట్, ఇన్నోవేషన్, క్రీడా పోటీలు నిర్వహించారు. 40కి పైగా పాఠశాలల నుంచి వచ్చిన 1800 మంది విద్యార్థి క్రీడాకారులను ఒక చోట చేర్చింది. 25 పైగా ఈవెంట్లలో బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, తైక్వాండో, టేబుల్ టెన్నిస్, చెస్, యోగా విభాగాల్లో పోటీ పడ్డారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్కూల్ వ్యవస్థాపకురాలు, డైరెక్టర్ మేఘనా గోరుకంటి హాజరై మాట్లాడుతూ యువ మేధావులు తమ ప్రతిభను, సృజనాత్మకతను వ్యక్తపరచుకునే వేదికన్నారు.

చలో సెక్రటేరియట్‌కు తరలిన బీజేపీ నాయకులు




బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుంటున్న దృశ్యం

గచ్చిబౌలి: బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపుపై చలో సెక్రటేరియెట్‌కు శేరిలింగంపల్లి బీజేపీ నాయకులు తరలివెళ్ళారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్‌యాదవ్ నాయకత్వంలో పలువురు నాయకులు వెళ్లగా సెక్రటేరియట్ సమీపంలో రవికుమార్‌యాదవ్, రాధాకృష్ణయాదవ్, మహిపాల్‌రెడ్డి, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నియంతలా వ్యవహరిస్తోందన్నారు. నిత్యం ట్రాఫిక్‌జామ్‌లు.. చినుకు పడితే రోడ్లన్నీ వరద నీటితో నిండిపోతున్నాయని ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని విమర్శించారు.



మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో శుక్రవారం కొత్తకాపు హర్షితరెడ్డి, కొత్తకాపు రుచితారెడ్డి భరతనాట్య అరంగేట్రం చేశారు. ప్రదర్శనలో షణ్ముఖ కౌత్వం, అలరిపు, జతిస్వరం, శబ్దం, పదవర్ణం, నటనం, రామ చంద్రభజన, తిల్లాన, మంగళం తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు. శ్రీ నారాయణీయం నాట్యాలయంలో శిక్షణ పొంది. సంతోష్‌కుమార్ తమాంగ్ వద్ద శిష్యరికం చేశారు. కార్యక్రమానికి కర్నాటిక్ సంగీత గురువులైన డాక్టర్ మీనాక్షి పద్మనాభం, భరతనాట్యం గురువు డాక్టర్ పి.ఇందిరాహేమ, కూచిపూడి గురువు డాక్టర్ విజయ్‌పాల్ పత్లోత్ పాల్గొని కళాకారులను అభినందించారు.

ప్రముఖ రంగస్థల నటుడు సురభి వనారస పూర్ణ చంద్రశేఖర్ మృతి



పూర్ణ చంద్రశేఖర్ (ఫైల్)

శేరిలింగంపల్లి: ప్రముఖ రంగస్థల నటుడు సురభి వనారస పూర్ణ చంద్రశేఖర్ (73) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందారు. శేరిలింగంపల్లి సురభి కాలనీలో ఉంటున్న ఆయనకు గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు సిటిజన్ హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. బాల నటుడిగా నటన ప్రారంభించిన ఆయన సురభి సంస్థలో అనేక వైవిధ్యమైన పాత్రలు పోషించి ప్రేక్షకులను అలరించారు. నటుడిగా, టెక్నీషియన్‌గా ఫ్రాన్స్, లండన్, అమెరికా వంటి దేశాల్లో ప్రదర్శనలు ఇచ్చారు. చంద్రశేఖర్ మృతి నాటకరంగానికి తీరని లోటని రంగస్థల నటులు పేర్కొన్నారు. ఆయనకు 2006లో చమన్‌లాల్ అవార్డు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2025లో ఉగాది పురస్కారం, ఆరు సార్లు నంది అవార్డులను, తిరుమల తిరుపతి దేవస్థానంచే నాలుగుసార్లు గరుడ అవార్డులను అందుకున్నారు. ఆయన అంత్యక్రియలు శేరిలింగంపల్లిలో శనివారం మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించనున్నట్లు కుమారుడు కిషోర్ కుమార్ తెలిపారు.

గణేష్‌గడ్డ బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రిక ఆవిష్కరణ



బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: వినాయక చవితిని పురస్కరించుకొని ఈనెల 27 నుండి సెప్టెంబర్ 6వ తేదీ వరకు రుద్రారం గ్రామ పరిధిలోని గణేష్‌గడ్డ సిద్ధి వినాయక ఆలయంలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం పటాన్‌చెరులోని ఎమ్మెల్యే నివాసంలో బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వినాయక చవితి సందర్భంగా 27వ తేదీ రోజు మహాగణపతికి ప్రత్యేక పూజలతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమై.. సెప్టెంబర్ 6వ తేదీ జాతర, లడ్డు వేలం పాట, రథోత్సవంతో ముగుస్తాయని తెలిపారు. భక్తులందరూ పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఈఓ లావణ్య, జూనియర్ అసిస్టెంట్ ఈశ్వర్, ఆలయ అర్చకులు సంతోష్‌జోషి, చంద్రశేఖర్, జగదీశ్వర్ స్వామి, అయ్యప్ప, సతీష్,మాజీ సర్పంచులు సుధీర్ రెడ్డి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.